క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి పోలీసు స్టేషన్ రోడ్డు, సుబేదారి రామాలయం దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటినుంచి బ్రహ్మకుమారీల స్వర్ణోత్సవాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఢీ కన్వెన్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో బ్రహ్మకుమారీల స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓరుగల్లు కేంద్రంగా ఆధ్యాత్మిక సేవల్లో 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న తరుణంలో వేడుకలను రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క పాల్గొంటారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రకు చెందిన నాలుగు వేల మంది బ్రహ్మకుమారీలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

భారత జాగృతి జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్లూరి పవన్



హన్మకొండ: భారత జాగృతి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్లూరి పవన్‌ను నియమించినట్లు సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, జిల్లా అధ్యక్షుడు మూల రాము గౌడ్ తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హనుమకొండ నయింనగర్‌కు చెందిన కల్లూరి పవన్‌కు నియామక పత్రం అందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



ఖిలా వరంగల్: ఇటీవల నిర్వహించిన ఒలంపియడ్ పరీక్షల్లో వరంగల్ శంభునిపేటకు చెందిన రెనాల్డ్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో వారికి ప్రిన్సిపాల్ శ్రీధర్ సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, రాజేశ్వర్‌రెడ్డి, రామ్‌కి, మహేష్, శ్రీహరి, సుష్మిత, డీన్ వెంకటేష్, కావ్య, సతీష్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ సిబ్బంది రక్తదానం



ఎంజీఎం / కాశిబుగ్గ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తమకు రక్తం అవసరముందని, దాతలు స్పందించాలనే సోషల్ మీడియా పోస్టుకు ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది స్పందించారు. ఈక్రమంలో కాకతీయ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి రోగికి రక్తం అందించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ అధికారి వెంకన్న మాట్లాడుతూ రక్తం అవసముందనే పోస్టు చూడగానే తమ సిబ్బంది నలుగురితో కలిసి వచ్చి రక్తం అందించినట్లు వివరించారు.

అనంతమల్లయ్యకు నివాళి

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతికి శుక్రవారం పలువురు ఘన నివాళి అర్పించారు. ఇటీవల కన్నుమూసిన సిద్ధాంతి చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, సినీ నటుడు రచ్చ రవి, డీసీపీ జనార్దన్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

'భగీరథ' నీళ్లు రావడం లేదు

హసన్‌పర్తి: 66వ డివిజన్‌లోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని టీజేఎస్ మండల చైర్మన్ అనుమాండ్ల విద్యాసాగర్ అన్నారు. ఈమేరకు స్థానిక ఏఈ హరికుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు.

'హత్యాయత్నం'లో ముగ్గురు అరెస్ట్

ఖిలా వరంగల్: మర్యాద ఇవ్వకుండా అసభ్యకరంగా మాట్లాడుతావా అంటూ.. యువకుడిపై కత్తితో దాడి చేసిన ఓ పాత నేరస్తుడితోపాటు విద్యార్థి, రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ కేసు వివరాలు వెల్లడించారు. గత డిసెంబర్ 31న రాత్రి ఉర్సు కరీమాబాద్ బీఆర్‌నగర్‌కు చెందిన గిరబోయిన మహేందర్ అలియాస్ మహేష్‌పై పాత నేరస్తుడు మల్లికార్జున్ అలియాస్ మల్లేశం, ఇతని మేనల్లుడుతోపాటు కాశిబుగ్గకు చెందిన రౌడీషీటర్ గడ్డం సంపత్‌లు కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

హన్మకొండ: బాధిత మహిళలు, బాలికలు సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేసు వర్కర్ విసీల సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేందుకు సఖి కేంద్రం పని చేస్తోందని వివరించారు. విడిపోవాలనుకున్న భార్యాభర్తలను కౌన్సెలింగ్ ద్వారా ఒకటిగా కలపనున్నట్లు తెలిపారు. వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేసేందుకు ఒత్తిడికి గురిచేయడం వంటి సమస్యలతో కృంగిపోయే మహిళలకు కావాల్సిన సహాయాన్ని అందించనున్నట్లు వివరించారు. సఖి కేంద్రం ద్వారా బాధితులకు ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటివి అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 0870 – 2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు ప్రత్యూష, మల్లారెడ్డి పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీదేవి

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఎంజీఎం: మహిళా చట్టాలపై నర్సింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సఖి కేంద్ర నిర్వాహకురాలు శ్రీలత, లీగల్ సెల్ కౌన్సిలర్ శోభారాణి సూచించారు. కేఎంసీ ప్రాంగణంలోని నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయ అధ్యక్షతన మహిళా చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైధింపులకు గురైన బాలికలు, మహిళలు సఖి సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాంటి వారికి న్యాయ, పోలీస్, వైద్య సేవలందించనున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 100, 181, 1098 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వైద్యానికి సర్కారు అధిక ప్రాధాన్యం

దేశాయిపేట: పేదల వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన వీరగోని సుమలత (30) కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల 50వేల ఎల్‌ఓసీ పత్రాలకు సుమలత భర్త మురళికి మంత్రి శుక్రవారం అందజేశారు.

గిలాఫ్‌ను దర్శించుకున్న మంత్రి

వరంగల్: అజ్మీర్ దర్గాకు పంపించే గిలాఫ్‌ను ఎల్‌బీనగర్ యమిన్‌పురాలో మంత్రి సురేఖ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యాకుబ్‌పాషా, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజు, నల్గొండ రమేష్, గోరంటల రాజు, అఫ్జల్, సందీప్‌కుమార్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. వరంగల్ ఉర్సు కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన ప్రజాపాలనలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పక్షుల దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న మంత్రి సురేఖ

ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను ఉద్యోగం నుంచి తొలగించాలని, కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా అవినీతి అక్రమాలకు కేయూ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు. ఒక్కరికే మూడు, నాలుగు పదవులు కట్టబెట్టడంతో అవినీతి పెరిగిపోయిందని వివరించారు. నాయకులు అశోక్, రమేష్, శ్రీను, పృథ్వీ, రాజ్‌కుమార్, శంకర్, గౌతం, శేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలను పట్టించుకోని బీఆర్ఎస్

కేయూ క్యాంపస్: గత పదేళ్ల కాకతీయ యూనివర్సిటీ, వర్సిటీలోని హాస్టళ్లు, మెస్‌లు, ఎస్‌డీఎల్‌సీఈ, పరీక్షల విభాగాల్లో పలు అవినీతి ఆరోపణలు వచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రీ విమర్శించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలు అవినీతికి అడ్డాలుగా మారాయని అన్నారు.



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీటీఎస్ఎఫ్ అధ్యక్షుడు మాలోతు వెంకన్న నాయక్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ యూనివర్సిటీలు అవినీతికి అడ్డాగా మారాయని ఆయన పేర్కొన్నారు.

స్రవంతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధకురాలు పోరిక స్రవంతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫార్మలాజికల్ స్టడీస్ ఆఫ్ సమ్ ఇండిజినెస్ మెడిసినల్ ప్లాంట్స్ ఫర్ యాంటీ డైబెటిక్ యాక్టివిటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్రవంతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. కళాశాల ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో స్రవంతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కాశిబుగ్గ వాసులకు డాక్టరేట్



పరంధామ



రాజ్‌కుమార్

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఇద్దరు పరిశోధకులు హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రసాయన శాస్త్రంలో 'ఎంప్యూరిటీ ప్రో ఫీలింగ్ అండ్ సింథసిస్ ఆఫ్ ఎసిటోవని లోన్‌లో ఫ్రీడమ్ ఆర్ సాల్మెట్రోల్ జీనో ఫోరెుట్ పోసకినజోల్ అండ్ డై హైడ్రాలజీ సల్ఫేట్' అనే అంశంపై గుడ్ల పరంధామ పరిశోధనలు చేశారు. అలాగే, రసాయన శాస్త్రంలో 'సింథసిస్ సైటోటాక్సిక్ యాక్టివిటీ అండ్ మాలిక్యులర్ డాకింగ్ స్టడీస్ ఆఫ్ టెట్రాసైక్లిక్ ఫ్యూజ్డ్ ఆక్రిడాన్ డెరివేటివ్స్' అనే అంశంపై రాజ్‌కుమార్ పరిశోధనలు చేశారు.

బీఆర్ఎస్ నేతల తీరు మారడం లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: ప్రజలు తగిన బుద్ధి చెప్పినా బీఆర్ఎస్ నాయకుల తీరు మారడం లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు విమర్శించారు. ప్రజాపాలనలో భాగంగా 66వ డివిజన్ హసన్‌పర్తిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పాలకులు రూ.లక్షలాది కోట్ల అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే తాము రెండు గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టామని ఆయన వివరించారు.

ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం సొంతం

పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివితే విజయం సాధించవచ్చని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శుక్రవారం అందించారు. బాల వికాస సాంఘిక సేవా సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హసన్‌పర్తిలోని ఇందిరాకాలనీలో బాల వికాస సంస్థ మహాసభ శుక్రవారం నిర్వహించారు.

దరఖాస్తులను కంప్యూటరీకరణ చేయాలి

కరీమాబాద్ : అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించిన దరఖాస్తుల కంప్యూటరీకరణ పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆన్‌లైన్ డేటాఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయం, మీ సేవ కేంద్రాల డేటా ఎంట్రీ ఆపరేటర్లను మూడు సెక్షన్లుగా విభజించి జిల్లా పరిషత్, డీఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నమోదును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సీపీఓ జీవరత్నం, డీపీఓ కల్పన, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా చూడాలి

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడే అన్నారు. డీఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ సంపత్‌రావు, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ జోనా, డీసీఓ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మనువాదులకు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

వరంగల్ చౌరస్తా: ప్రజా వ్యతిరేక మనువాద పాలకులకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలను సిద్ధం చేస్తూ, పార్టీ శాఖలను పటిష్ట పరుస్తామని ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించింది. కామ్రేడ్ కన్నం వెంకన్న అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలో ఓంకార్ భవన్‌లో శుక్రవారం భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం మనువాద భావజాలాన్ని పెంపొందిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడే వ్యక్తులు, శక్తులను నియంతృత్వ ధోరణితో తప్పుడు కేసులు పెట్టి నిర్బంధం ప్రయోగిస్తోందని వాపోయారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర నాయకులు మంద రవి, నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, కనకం సంధ్య, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నృత్య పోటీల్లో చిన్నారికి అవార్డు



హన్మకొండ: జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విద్యార్థి కె.సమీక్షా రెడ్డి ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ చాయిస్ అవార్డు గెలుచుకుంది. డిసెంబర్‌లో 30, 31 తేదీల్లో ఉత్తర ప్రదేశ్‌లోని మధురలో 13వ కృష్ణరంగ్ మహోత్సవ్‌లో భాగంగా ఇంటర్‌నేషనల్ మల్టీలింగ్వల్ ప్లే డ్యాన్స్ పోటీలు జరిగాయి. అందులో కూచిపూడి విభాగంలో హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన సమీక్షా రెడ్డి అద్భుత ప్రదర్శన కనబరిచి అవార్డు గెలుచుకుంది.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

హసన్‌పర్తి: అధికారంలోకి లేకున్నా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హంటర్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో హసన్‌పర్తి మండలశాఖ కార్యకర్తల విస్తృతస్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. అయితే, ఓటమి పొందినప్పటికీ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేలా చూస్తానని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ బండా రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రమేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరూరి రమేష్

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

కాశిబుగ్గ: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయవచ్చని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనచారి తెలిపారు. వైద్యశాల ఆధ్వర్యంలో భద్రకాళి దేవాలయ ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పురాతన వైద్యమని, ఎలాంటి సైడు ఎఫెక్ట్‌లు ఉండవని చెప్పారు. సుమారు 250 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేసినట్లు వివరించారు. శిబిరంలో దేవాలయ ఈఓ గాయత్రి, ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, వైద్యులు ఎస్.స్వరూప, శ్రీలత, కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బీకే దారి, డాక్టర్ అపర్ణ, ఫార్మసిస్ట్ లక్ష్మి, హౌస్ సర్జన్లు తేజశ్రీ, దేవేందర్ సిబ్బంది రజిత, మహమ్మద్ అజార్ పాషా పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న వైద్యులు

మంత్రి సీతక్కను కలిసిన రేషన్ డీలర్లు

ఖిలా వరంగల్: ములుగు జిల్లాలోని జగ్గన్నపేటలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనుసూర్య (సీతక్క)ను రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు బోయినిపెల్లి సంపత్‌రావు, జిల్లా అధ్యక్షుడు వెల్దండి శ్రీనివాస్, మండల కార్యదర్శి చంద్రమౌళి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

మంత్రి ప్రభాకర్‌కు నోట్‌బుక్స్ అందజేత



మంత్రికి నోట్‌బుక్స్ అందజేస్తున్న నర్సింహారెడ్డి

హసన్‌పర్తి / హన్మకొండ అర్బన్: ఎల్కతుర్తి మండల కేంద్రానికి వచ్చిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, గూడెప్పాడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి స్వాగతం పలికి, 500 నోట్‌బుక్స్, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లను అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మంత్రి ప్రభాకర్‌ను రెడ్డి సంఘం ప్రతినిధులు కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జున్ కిషన్‌రెడ్డి, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి జోగిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



గోదామాధవ కేంద్రంలో అక్షింతల అందజేత

హన్మకొండ కల్చరల్: ఆనాడు శ్రీరాముడు ధర్మపోరాటం చేసి విజయం సాధించారని, ఈనాటి ధర్మపోరాట ఫలితమే శ్రీరామ మందిరమని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి అన్నారు. శక్తివంతుడైన శ్రీరాముడిని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈమేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతలను హనుమకొండ అశోక్‌కాలనీలోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రానికి అందజేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు రాజిరెడ్డి, వెన్నపురెడ్డి రమణారెడ్డి, కాలనీవాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో అక్షింతల పంపిణీ

హన్మకొండ: అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను హనుమకొండ గాంధీనగర్‌లో శుక్రవారం పంపిణీ చేశారు. అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పోచమ్మ, శ్రీకృష్ణ దేవాలయ చైర్మన్ బొంగు రాజు, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, కమిటీ ప్రతినిధులు మాడిశెట్టి వీరేందర్, మాదాడి రాజిరెడ్డి, చిట్టిరెడ్డి తిరుపతి రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గందె కృష్ణమూర్తి, మహేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న గాంధీనగర్ వాసులు

61వ డివిజన్‌లో..

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ, రామకృష్ణ కాలనీ, నాన్యతండాలో శుక్రవారం ఇంటింటికి శ్రీరామ అంక్షింతలు పంపిణీ చేశారు. గోదాదేవి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అంక్షింతలకు ఆలయ ప్రధాన అర్చకులు రఘురామాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు. కాలనీ పెద్దల సహకారంతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అంక్షింతలను అందజేశారు.

దర్గా పవన్‌నగర్‌లో..

కాజీపేట రూరల్: అయోధ్య శ్రీరామ మందిర అక్షింతలను కాజీపేట 48వ డివిజన్ దర్గా పవన్‌నగర్‌లో బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మల్లయ్య, మణికుమార్, సాంబులు, బన్నీ, యాదలక్ష్మి, పద్మ, ఎల్లమ్మ, సుజాత, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కాజీపేట: చైతన్యపురి కాలనీలో..



కాజీపేట రూరల్: పవన్‌నగర్‌లో..

సంక్షిప్తంగా

ప్రజా పాలనలో ప్రొటోకాల్ రగడ

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోటలోని పోచమ్మ గుడి ఆవరణలో అధికారుల ఆధ్వర్యంలో కార్పొరేటర్ వేల్పుకొండ సువర్ణ అధ్యక్షతన ప్రజాపాలన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా స్పెషల్ ఆఫీసర్ పుష్పలత హాజరై ప్రజాపాలనను పరిశీలించారు. కాగా, ప్రజాపాలన కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించటం లేదంటూ అధికారులను కార్పొరేటర్ భర్త బోగి సురేష్ నిలదీశారు. దాంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. మిల్స్‌కాలనీ పోలీసులు అక్కడి చేరుకుని గొడవను సద్దుమణిగించారు.

హెల్త్ డైరెక్టర్‌ను కలిసిన స్నేహితులు

వరంగల్ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రవీంద్రనాయక్‌ను వరంగల్ జిల్లా సంగెం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ వాసం సురేందర్, విశ్వకర్మ సంఘం నాయకులు చిట్టిమళ్ల రమేష్‌బాబు, సంగెం ఎంపీపీ కందకట్ల నరహరి తదితరులు ఉన్నారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీకి శుభాకాంక్షలు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కలిశారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో వరుణ్‌రెడ్డిని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు వేమన రెడ్డి, మహేష్, వేణు, సంపత్, శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వేములవాడలో అతిథి గృహం నిర్మాణం

వరంగల్: వరంగల్‌కు చెందిన పారిశ్రామిక వేత్త, వరల్డ్ పద్మశాలి క్లబ్ వ్యవస్థాపకుడు రామా శ్రీనివాస్.. తమ తల్లిదండ్రుల పేరిట వేములవాడలో భక్తుల వసతి కోసం అతిథి గృహం (శివ సదనం) నిర్మించారు. ఈమేరకు వేములవాడ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కృష్ణప్రసాద్‌కు అప్పగించారు. నిత్య అన్నదానానికి రూ.8 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు మోక్ష రామం ఫౌండేషన్ కుటుంబ సభ్యులు, రాష్ట్ర పద్మశాలి సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్‌ను వీడేది లేదు

హన్మకొండ: ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌ను వీడేది లేదని, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ వెంటే ఉంటామని 5వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బొల్లెపెల్లి పున్నంచందర్ స్పష్టం చేశారు. హనుమకొండలోని దాసరివాడలో డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

మాల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కాజీపేట రూరల్: తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను కాజీపేట బాపూజీనగర్ పోచమ్మగుడి ప్రాంగణంలో ఆవిష్కరించారు.

బాధిత కుటుంబానికి చేయూత



మడికొండ: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన మృతుడి కుటుంబ సభ్యులకు అతడి స్నేహితులు ఆర్థిక చేయూతనందించారు. మడికొండ గ్రామానికి చెందిన కల్లెపు రమేష్(50) గతనెలలో మృతి చెందారు. ఈమేరకు మృతుడి పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.30వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు దండిగం రవీందర్, నల్ల ప్రవీణ్, లోకిని రవీందర్, బుర్ర రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.